ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

గురువారం | అక్టోబరు 08, 2026 | సంపుటి : 7 | సంచిక : 109 | పేజీలు : 2



భారతీయుల విశ్వాసమే

## నా బలం

### ప్రధాని నరేంద్ర మోదీ

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి
- వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు
- దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి
- విఘ్నహర్త ఆశీస్సులతో దేశం ప్రగతిపథంలో సాగాలని ఆకాంక్ష

**ఢిల్లీ, ఆయుధం:** ఇరవై ఐదేళ్లుగా నిరంతర ప్రజాసేవ అందిస్తానని అప్పుడు ఊహించలేద ప్రధాని మోదీ అన్నారు. ప్రజా ఆశీర్వాద బలమే తనను ఇంతకాలం నడిపించిందని పేర్కొన్నారు. ప్రజలు అందించిన నిరంతర ఆశీస్సులు, విశ్వాసం వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆశీస్సులు అందించిన దేశ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని మోదీ అన్నారు. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో దేశానికి మరింత సేవ చేస్తానన్నారు. ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల నిరంతర ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రయాణాన్ని, ప్రజలతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

#### 2001లో గుజరాత్ సీఎంగా తొలి అడుగు

2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసిన రోజులను ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. అప్పటివరకు ఎన్నుకోబడిన పదవిలో పనిచేసిన అనుభవం తనకు లేకపోయినా, ప్రజా జీవితంలో కీలక బాధ్యతలు చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. అప్పట్లో 25 ఏళ్ల పాటు ప్రభుత్వాధినేతగా కొనసాగుతానని తాను ఊహించలేదని మోదీ తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా పలు పర్యాయాలు పనిచేసిన తర్వాత 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి వరుసగా మూడు పర్యాయాలు దేశ ప్రధానిగా కొనసాగుతున్నారు. తన రాజకీయ ప్రస్థానంలో సాధించిన ప్రతి విజయానికి ప్రధాన కారణం ప్రజలేనని స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నా, అందులో కోట్లాది భారతీయుల విశ్వాసం కీలక పాత్ర పోషించిందన్నారు. పార్టీ కోసం కష్టపడిన లక్షలాది కార్యకర్తల శ్రమ కూడా తనకు ఎంతో బలాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని పాలనకు మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగినట్లు తెలిపారు.

#### 'ప్రతి అనుభవం ఓ పాఠమే'

25 ఏళ్ల ప్రస్థానాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే తనలో మొదట కలిగే భావన కృతజ్ఞతేనని ప్రధాని అన్నారు. తన జీవితంలో ఎదురైన ప్రతి వ్యక్తి, ప్రతి సంఘటన ఏదో ఒక విషయాన్ని నేర్పిందని చెప్పారు. తనను గెలిపించినవారు వినయంగా ఉండటం నేర్పారని, ఓటమి లేదా ఎదురుదెబ్బలు తిరిగి నిలబడే శక్తిని ఇచ్చాయని మోదీ పేర్కొన్నారు. శ్రేయోభిలాషులు ప్రోత్సహించగా, విమర్శకులు తనను తాను లోతుగా పరిశీలించుకునే (మిగతా 2 లో..)







## ఢిల్లీ ఉద్రిక్తం..

### జంతర్‌మంతర్ వద్ద విపక్ష ఎంపీల ఆందోళన

**ఢిల్లీ, ఆయుధం:** ఢిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్ష ఇండీ కూటమి ఎంపీలు మరోసారి ఆందోళన చేపట్టారు. మొదట ఓ హోటల్‌లో సమావేశమైన నేతలు, తర్వాత బస్సులో ఎన్నికల సంఘం కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని అవమానిస్తోందని ఆరోపించారు. ఈసీ అరాచకాలను దేశం మొత్తం ప్రచారం చేస్తామన్న ఆయన, కేంద్ర ప్రభుత్వ బెదిరింపులకు తలొగ్గేది లేదని తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. మంగళవారం ఈసీని కలుద్దామని 300 మంది ఎంపీలం వెళ్లామన్న రాహుల్‌గాంధీ, తమను పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదన్న రాహుల్, ఆయన రాజీనామా చేసేవరకూ పోరాటం కొనసాగిస్తాన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తనపై పెట్టే కేసులను పతకాలుగా భావిస్తానని తెలిపారు.

#### జంతర్ మంతర్ వద్ద బలగాల మోహరింపు

మరోవైపు విపక్ష ఎంపీలు జంతర్ మంతర్ వైపు ర్యాలీగా వస్తున్న నేపథ్యంలో అక్కడా భద్రతను పటిష్ఠం చేశారు. బస్సులో జంతర్ మంతర్ వైపు వెళ్తున్న వారిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష ఎంపీలు ఉన్నారు. అటు మంగళవారం ప్రతిపక్ష పార్టీలు ర్యాలీ నిర్వహించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వద్ద భారీగా భద్రతా బలగాలను మోహరించారు. రాజధానిలో ఇతర చోట్ల నిరసనలకు పోలీసులు అనుమతించకపోవడంతో జంతర్ మంతర్ వైపు వెళ్తున్నామని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేడా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "అమిత్ షా ఆధ్వర్యంలోని దిల్లీ పోలీసులు రాజధానిలో ఎక్కడా నిరసన తెలిపేందుకు మమ్మల్ని అనుమతించడంలేదు. అందుకే ప్రతిపక్ష పార్టీల ఎంపీలతో కూడిన బస్సులన్నీ ఇప్పుడు శాంతియుత నిరసనల కోసం కేటాయించిన జంతర్ మంతర్‌కు వెళ్తున్నాయి. ఆర్టికల్ 19 ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే మన రాజ్యాంగ హక్కును ఇస్తుంది." అని ఖేడా అన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి భారీగా నిధులు

- కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.3.80 కోట్లు
- పొట్లపల్లి శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1.50 కోట్లు
- హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.85 లక్షలు



**హనుమకొండ, ఆయుధం:** హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల వినియోగానికి దేవాదాయ శాఖ పరిపాలనా అనుమతులు జారీ చేసింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.3,80,33,750ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ నిధులతో 5 అంతస్తుల రాజగోపురం, ప్రాకార మండపం/బౌండరీ వాల్, దక్షిణ మరియు పశ్చిమ వైపులా 3 అంతస్తుల రాజగోపురాలు, కార్యాలయ భవనం, శ్రీ లక్ష్మి గణపతి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అలాగే పనుల అమలుకు అవసరమైన నిధుల కోసం దేవస్థానం వద్ద ఉన్న 9 ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి గరిష్టంగా రూ.3,85,29,060 వరకు ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్ల నిధుల వినియోగానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నిధులతో 5 అంతస్తుల రాజగోపురం నిర్మాణంలో మిగిలిన పనులకు రూ.50 లక్షలు, ఆలయం చుట్టూ ప్రాకార మండపం నిర్మాణానికి రూ.1 కోటి ఖర్చు చేయనున్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని (మిగతా 2లో..)




## వికసిత భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రస్థానం

- బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి.
- వరంగల్ చౌరస్తాలో ఘనంగా 'వికసిత్ సంకల్ప సభ'

**వరంగల్, ఆయుధం:** ప్రభుత్వాధినేతగా 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకోవడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక అరుదైన, అద్భుతమైన మైలురాయి అని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి అధ్యక్షతన వరంగల్ చౌరస్తాలో బుధవారం "వికసిత్ సంకల్ప సభ" కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ప్రభుత్వాధినేతగా 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకోవడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక అరుదైన, అద్భుతమైన మైలురాయి అని నాయకులని, పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ప్రధాని మోడీ గారి పాలన (మిగతా 2 లో..)



## మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.1,108 కోట్లు

**హైదరాబాద్, ఆయుధం:** మంచిరేవులలోని మూసీ నది ఒడ్డునున్న ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.1,108 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధులను ఆలయ అభివృద్ధి, ఆరు వరుసల రహదారి నిర్మాణానికి వినియోగించనున్నారు. మరోవైపు ఓంకారేశ్వర ఆలయానికి సాంకేతిక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ చీఫ్, కమిటీ కోఛైర్మన్‌గా పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ చీఫ్ వ్యవహరించనున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు

**హైదరాబాద్, ఆయుధం:**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం రెండు డీఏలు మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2024 జనవరి, జులై డీఏలను ప్రభుత్వం విడుదల చేసింది. రెండు డీఏలు కలిపి 6.27 శాతం పెరుగుదల ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అక్టోబర్ వేతనంతో కలిపి పెరిగిన డీఏలను చెల్లించనున్నారు. డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమవుతాయి. సీపీఎస్ ఉద్యోగులకు మొదటి డీఏ 33, రెండో డీఏ 27 వాయిదాలలో చెల్లించనున్నారు.

## బతుకమ్మ, దసరా ఉత్సవాలకు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ, ఆయుధం:** జిల్లాలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 10వ తేదీ నుండి 21 వరకు జరగనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు సంబందించి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఇతర శాఖల అధికారులతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీక్షించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతీ పండుగకు సంబంధిత అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటే అన్నీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవచ్చన్నారు. అధికారులు సమన్వయంతో బాధ్యతయుతంగా విధులని నిర్వర్తించి బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, దేవాదాయ శాఖ, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఇబ్బంది కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.... ఎంగిలి పూల బతుకమ్మ వేయి స్తంభాల గుడిలో.. అలాగే సద్దుల బతుకమ్మ వేడుకలు పద్మాక్షమ్మ ఆలయంలో జరుగుతాయాన్నారు. సంబంధిత అధికారులు అప్పగించిన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించి ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలు జరిగే ప్రదేశాలలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. ఈ సమావేశంలో భద్రకాళి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల గురించిన వివరాలను ప్రధానార్చకులు భద్రకాళి శేషు వివరించగా, వేయి స్తంభాల గుడి, పద్మాక్షమ్మ దేవాలయాలలో జరగనున్న బతుకమ్మ ఉత్సవాలను గురించి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, శంకర్ శర్మ అర్చకులు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత , గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, జడ్పీ సీఈఓ శేషాద్రి, డిఆర్డివో మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు వెంకన్న, వెంకటేష్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, వివిధ శాఖల అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.






## దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్, ఆయుధం:**

దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్య స్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. పండుగ సందర్భంగా 7వేల ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. (మిగతా 2లో..)



## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి

# క్రీడలు అవసరం

- కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**వర్ధన్నపేట, ఆయుధం:** యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆటలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయని కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పేర్కొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డి.సి తండా దుర్గమ్మ గుడి ప్రాంగణంలో సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని తొలి మ్యాచ్‌లో తలపడుతున్న కేశవపురం, ఎన్ ఎస్ తండా క్రీడాకారులకు టాస్ వేసి, స్వయంగా బ్యాట్ పట్టి పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సేవాలాల్ యూత్ సభ్యులు ఈ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత క్రీడల్లో రాణిస్తూ, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. యువతలో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుందని ఇలాంటి టోర్నమెంట్లు వారిలోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఎంతగానో తోడ్పడతాయని, క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఆటలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడమే కాకుండా, శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని యువత క్రీడలను ఒక అలవాటుగా మార్చుకుని, ఆరోగ్యంగా ముందుకు సాగాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు అందిస్తున్న ప్రత్యేక రిజర్వేషన్లను యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి రంగాలలో స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరిమిల్ల సంపత్ రావు, జన్ను రాములు, ప్రభాకర్, రాము నాయక్, సంతోష్ నాయక్, రమేష్, నరేశ్, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి భారీగా నిధులు

(మొదటి పేజీ తరువాయి..)
శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధి పనులకు ఆలయం వద్ద ఉన్న FDRల నుంచి రూ.85 లక్షల వరకు నిధులు ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది.

### నిబంధనల మేరకే నిధుల వినియోగం

ఆమోదించిన ప్లాన్లు, అంచనాలు, దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగానే నిధులను వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పనులకు వాస్తవంగా అవసరమైన మేరకు మాత్రమే ఎఫ్‌డీఆర్‌ల నుంచి నిధులు ఉపసంహరించుకోవాలని, మిగిలిన మొత్తాన్ని ఎఫ్‌డీఆర్‌లలోనే కొనసాగించాలని ఆదేశించింది. నిధుల ఉపసంహరణ, ఎఫ్‌డీఆర్‌ల వివరాలు, ఖర్చు చేసిన మొత్తం తదితర అంశాలతో పూర్తి నివేదికను సమర్పించాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.




# నిరంతర సాధనతో పోటీ పరీక్షల్లో విజయం

- సమీక్ష ఐఏఎస్ అకాడమీ వరంగల్ బ్రాంచ్ పోస్టర్ ఆవిష్కరణ

**హనుమకొండ, ఆయుధం:** పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సరైన అకాడమిక్ అప్రోచ్, విషయ పరిజ్ఞానం, నిరంతర సాధన ఎంతో అవసరమని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్, సమీక్ష IAS అకాడమీ చీఫ్ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి. గణేష్ అన్నారు. ప్రొఫెసర్ పి. కృష్ణమాచారి అధ్యక్షతన హన్మకొండలోని వాగ్దేవి డిగ్రీ & పీజీ కళాశాలలో సమీక్ష IAS అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం UPSC సివిల్ సర్వీసెస్, TGPSC గ్రూప్ 1, గ్రూప్ 2 తదితర పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. UPSC సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించిన కోర్ సబ్జెక్టులు, వాటి ప్రాధాన్యత, ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన ప్రామాణిక పుస్తకాల గురించి వివరించారు. సబ్జెక్టులపై స్పష్టమైన అవగాహన పెంచుకోవడంతో పాటు, సరైన పుస్తకాలను ఎంపిక చేసుకుని క్రమపద్ధతిలో చదవాలని సూచించారు. ప్రణాళికాబద్ధమైన చదువు, నిరంతర సాధనతో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సమీక్ష IAS అకాడమీ వరంగల్ బ్రాంచ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వరంగల్, హనుమకొండ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఇక్కడ సమీక్ష IAS అకాడమీ శాఖను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో UPSC, TGPSC పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.
కార్యక్రమానికి విద్యార్థులు, యువతతో పాటు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఈసీ సభ్యుడు, నియామకాల విభాగం డైరెక్టర్ డాక్టర్ చిర్ర రాజు, వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శేషాచలం, సమీక్ష IAS అకాడమీ ఫౌండర్లు గంటా అనిల్ నాయుడు, నటరాజ్ పైడి, వాసు, ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బిఆర్ఎస్, బీజేపీ నాయకుల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, ఆయుధం:** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల నియోజకవర్గ పరిధిలోని సోషల్ మీడియా కోఆర్డినేటర్లతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుత రాజకీయాల్లో సోషల్ మీడియా అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేయడంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్లు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, రైతులు, మహిళలు, యువత, పేదల కోసం అమలు చేస్తున్న పథకాలను వాస్తవాలతో కూడిన సమాచారంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు, తప్పుడు ఆరోపణలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటికి సోషల్ మీడియా వేదికగా సమర్థవంతంగా కౌంటర్ ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే లక్ష్యంగా సోషల్ మీడియా నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సోషల్ మీడియా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట

- హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- పోలీసుల అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ హనుమకొండలో భారీ ధర్నా
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం
- హాజరైన ఎమ్మెల్యేలు నాయిని, కేఆర్ నాగరాజు, జిల్లా ఛైర్మన్లు, పార్టీ శ్రేణులు




**హనుమకొండ, ఆయుధం:** ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో 'ఇండియా' కూటమి ఎంపీలు చేపట్టిన భారీ నిరసన ర్యాలీపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా దాడి చేయించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో డిసిసి కార్యాలయం చౌరస్తాలో వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. ఆర్. నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు.
ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఓట్ల తొలగింపు, s.i.r ప్రక్రియ లో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తే ఒక లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ తో పాటు ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం ప్రజా స్వామ్య విధానాలకు గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రజా స్వామ్య యుతంగా, శాంతి యుతంగా ఈ.సి ముందు దీక్ష చేసేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం చాలా దారుణం అని అన్నారు. ఇండియా కూటమి నాయకులు దేశంలో ఒక అతిపెద్ద సమస్యపై పోరాటం చేస్తుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇలా అడ్డుకోవడం నియంత పాలనకు పరాకాష్ట అన్నారు. దేశంలోని ఇండియా కూటమి ఎంపీలు రాహుల్ గాంధి, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలు పాల్గొన్న అంశంలో కేంద్రం ప్రవర్తించిన తీరు చాలా దుర్మార్గమని ఇది ప్రతి ప్రజాస్వామ్య వాది ఖండించాలని అన్నారు. దేశంలో అడ్డగోలుగా ఓట్ల చోరీ చేసి అక్రమంగా అధికారంలోకి వస్తున్న బీజేపీ ఇలా ఇండియా కూటమి నేతలను అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కార్పొరేషన్ల జిల్లా ఛైర్మన్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఆర్‌జీపీఆర్ఎస్ ప్రతినిధులు, మండల, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రస్థానం

(మొదటి పేజీ తరువాయి..)
ప్రపంచ దేశాలకే దిక్సూచిగా మారిందన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్' గా మార్చేందుకు ప్రధాని చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. దేశ రాజధాని ఢిల్లీ నుంచి ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా దేశ ప్రజలను, బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు స్క్రీన్‌లపై వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు హాజరయ్యారు.
ప్రధాని మోడీ ప్రసంగం దేశాభివృద్ధికి, వికసిత భారత్ నిర్మాణానికి దిక్సూచిలా నిలిచిందని, కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రధాని ప్రసంగం అనంతరం, సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ చౌరస్తాలో "సేవా జ్యోతి కలశయాత్ర"ను నాయకులు ఘనంగా ప్రారంభించారు. ఈ యాత్ర వరంగల్ చౌరస్తా నుండి కొత్తవాడ వరకు కార్యకర్తల నినాదాలు, దేశభక్తి స్ఫూర్తితో ఉత్సాహంగా సాగింది. జకోటియ కాంప్లెక్స్ ఎదురుగా గల జంక్షన్‌కు చేరుకున్న అనంతరం జాతీయ గీతాలాపనతో ఈ కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం సేవకు ప్రతీకగా తీసుకొచ్చిన సేవా జ్యోతిని ఆ జంక్షన్ వద్ద ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సదరు కూడలికి బీజేపీ శ్రేణులు "వికసిత్ సేవా జ్యోతి జంక్షన్" అని నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, సేవా జ్యోతి రాష్ట్ర కో కన్వీనర్ సిద్దం నరేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎర్రగొల్ల భరత్ వీర్, కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా పదాధికారులు వివిధ మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు కార్యకర్తలు, మహిళలు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు



**హనుమకొండ, ఆయుధం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టిక అల్పాహారాన్ని అందించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారని, తద్వారా ప్రతిరోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉదయం పూట ఆకలితో పాఠశాలకు వస్తున్నారనే విషయాన్ని తెలుసుకొని, సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించారని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్, చార్జీలను పెంచారని, విద్యార్థులకు సన్న బియ్యం భోజనాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆకలితో ఉండొద్దనే, వారికి పౌష్టిక ఆహారాన్ని అందించాలనే గొప్ప నిర్ణయంతో ఉదయం పూట సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని తీసుకువచ్చారని అన్నారు. సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకంలో భాగంగా విద్యార్థులకు ఇడ్లీ, మిల్లెట్స్, పూరి, ఉప్మా తదితర పౌష్టికాహారాన్ని రోజువారీ మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు డ్రాపౌట్లను పూర్తిగా నివారించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, భోజన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే, కలెక్టర్ పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించిన అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చొని అల్పాహారాన్ని భుజించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓ శ్రీనివాస్, తహసిల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, బాలికల, బాలుర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుమాదేవి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన మైనారిటీ మహిళలకు సంక్షేమ ఫలాలు

- స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి
- 200 మంది మైనారిటీ మహిళకు కుట్టు మిషన్ లను పంపిణీ




**హనుమకొండ, ఆయుధం:** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 200 మంది అర్హులైన ముస్లిం మైనారిటీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పేదలు, మహిళలు, రైతులు, కార్మికులు, మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. రోటి కపడా ఔర్ మకాన్‌జై జవాన్, జై కిసాన్ వంటి ప్రజా సంక్షేమ లక్ష్యాలతో కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందిరా మహిళా మైనారిటీ యోజన పథకం కింద వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 55 మంది ఒంటరి ముస్లిం మైనారిటీ మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులు అందించే కార్యక్రమాన్ని త్వరలో చేపడుతామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. అదేవిధంగా దూదేకుల, ఫకీర్ సామాజిక వర్గాలకు చెందిన లబ్ధిదారులకు 100 శాతం రాయితీతో ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించేలా పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, తక్కువ సమయంలోనే వారికి ఈ ప్రయోజనాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలకు, మైనారిటీ వర్గాలకు అందుతున్న ఈ ఆర్థిక సహాయాన్ని స్వయం ఉపాధి కోసం వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాకుండా వారు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఉపయోగపడే అవకాశమని అన్నారు.
అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా నియోజకవర్గంలో దరఖాస్తుల స్వీకరణ నుంచి లబ్ధిదారుల ఎంపిక వరకు అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారి ఇంటి గడప వరకు చేరేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మైనారిటీ మత పెద్దలు, మైనారిటీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# దసరాకు 7వేల ప్రత్యేక బస్సులు

(మొదటి పేజీ తరువాయి..)

- కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు.. (రీజియన్ల వారీగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678)
- హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు.. (మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440)
- గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది.
- ప్రధానంగా ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం.
- ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు
- దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం టికెట్ ధరలను సవరించిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం

# అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తులు

- ఈ నెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రిన్సిపాల్ డాక్టర్ జి. స్వర్ణ కుమారి

**ములుగు, ఆయుధం:** ప్రభుత్వ వైద్య కళాశాల, దాని అనుబంధ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వైద్య విభాగంలో రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. స్వర్ణ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న ఉదయం 11 గంటల నుంచి 17న మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు, ఈ నెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హతలు, దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ https://gmcmulugu.org ను సందర్శించాలని ఆ ప్రకటనలో ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# భారతీయుల విశ్వాసమే నా బలం

(మొదటి పేజీ తరువాయి..)

అవకాశం కల్పించారని చెప్పారు. తనకు మద్దతు ఇచ్చినవారు విశ్వాసం శక్తిని తెలియజేస్తే, తనను వ్యతిరేకించినవారు ప్రజాస్వామ్య బలాన్ని అర్థం చేసుకునేలా చేశారని వివరించారు. 25 ఏళ్ల ప్రస్థానం కేవలం గతాన్ని గుర్తుచేసుకునే సందర్భం కాదని ప్రధాని స్పష్టం చేశారు. భవిష్యత్తు కోసం కొత్త సంకల్పాన్ని పునరుద్ఘాటించాల్సిన సమయమని అన్నారు.

### 'సేవే లక్ష్యంగా స్వయంసేవకులు'

తాను ఎప్పుడూ ఒంటరిగా భావించలేదని మోదీ అన్నారు. దేశ సాంస్కృతిక ఆత్మను కాపాడుతూ, భారత్‌కు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న అనేక మంది స్వయంసేవకులు, కార్యకర్తలు తనకు అండగా ఉన్నారని చెప్పారు. తమను తాము 'దేశ సేవకులు, మానవాళికి సేవ చేసే సేవకులు'గా భావిస్తూ పనిచేస్తున్న ప్రతి స్వయంసేవకుడు, కార్యకర్తకు గౌరవంగా నమస్కరిస్తున్నట్లు తెలిపారు. దేశ సేవలో వారి నిబద్ధతను కొనియాడారు. వేదాల నుంచి స్వామి వివేకానంద వరకు గొప్ప ఆలోచనలను నిరంతరం ఆచరిస్తూ వచ్చిన భారతదేశం తనకు సేవ చేసే శక్తిని అందిస్తోందని ప్రధాని అన్నారు. వేల ఏళ్ల సాంస్కృతిక వారసత్వం ఉన్న దేశానికి సేవ చేసే అవకాశం లభించడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు. మానవత్వంపై ప్రపంచానికి విశ్వాసం కల్పించిన భారతదేశానికి సేవ చేస్తున్న సమయంలో తాను ఎప్పుడూ ఒంటరిగా భావించలేదన్నారు.

### వికసిత్ భారత్ కోసం లక్ష్యాలు

ఒకప్పుడు మనకు ఉగ్రవాదం పెనుముప్పుగా ఉండేదని, ఇప్పుడు భారత్ అభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ వేగాన్ని ఇక ఎవరూ ఆపలేరన్నారు. భారత తయారీ విమానాల గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు త్వరలో వస్తుందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాధించాలనే లక్ష్యంపై ఎలాంటి సందేహం లేదని మోదీ స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని కచ్చితంగా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యున్నత మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలబెట్టడం. ప్రపంచంలోనే అత్యున్నత మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలబెట్టడం, విభిన్న రంగాలలో దేశాన్ని స్వయంసమృద్ధిగా తీర్చిదిద్దడం, ప్రపంచ ఉత్పాదక రంగానికి భారతదేశాన్ని ప్రధాన కేంద్రంగా మార్చడం. ప్రతిష్ఠాత్మక ఒలింపిక్ క్రీడలను భారతదేశంలో విజయవంతంగా నిర్వహించడం వంటివి కూడా సాధిస్తామని తెలిపారు.

# పాఠశాలలో వసతుల పరిశీలన

**హనుమకొండ, ఆయుధం:** హసన్ పర్తి లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని వసతులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, సీసీ కెమెరాల పనితీరు, కిచెన్ షెడ్, కిచెన్ గార్డెన్ లో పెంచుతున్న మొక్కలు, పాఠశాల పై సమావేశాలు, యోగ శిక్షణకు ఏర్పాటు చేసిన షెడ్డును కలెక్టర్ పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమా దేవి వివరించారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695